# చిరుత కోసం గాలింపు



కల్లూరు శివారులో గాలింపు చర్యల్లో పాల్గొన్న అటవీ అధికారులు

కుంటాల, జనవరి 24: మండలంలోని కల్లూరు, పెంచికల్‌పాడ్ గ్రామ శివారులో చిరుత పులులు కనిపించాయని కొందరు రైతులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు బుధవారం రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. చిరుత పులుల పాదముద్రలు కనిపించలేదని, అయితే సీసీ కెమెరాలు అమర్చినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్ రాథోడ్ తెలిపారు. ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, డీఆర్వో రేష్మ, ఎఫ్‌బీవోలు ముస్తాక్, హరిలత, స్రవంతి పాల్గొన్నారు.

# పొల్లుగూడలో పెర్సాపేన్‌కు పూజలు



పెర్సాపేన్ దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి, జనవరి 24: మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని పొల్లుగూడలో జుగ్నాక్ వంశీయులు బుధవారం పెర్సాపేన్‌కు సంప్రదాయ పూజలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జుగ్నాక్ వంశీయులు తరలివచ్చి పెర్సాపేన్ పెద్దదేవుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ పెర్సాపేన్ దేవతను గ్రామం చుట్టూ తిప్పారు. కటోడ జుగ్నాక్ మహాదు, పెన్‌పటేల్ జుగ్నాక్ గోదీరావ్, జుగ్నాక్ కాశీరాం, జుగ్నాక్ మాణిక్‌రావ్, జుగ్నాక్ భారత్, సాహెబ్‌రావ్, గ్రామస్తులు కోరెంగ లింగూపటేల్, కోరెంగ పొల్లుపటేల్, ఆత్రం శంకర్, సిడాం జైతు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

## దివ్యాంగులకు నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 24: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దివ్యాంగుడు ఆటలు, చదువులు, పాటల్లో ప్రతిభ చూపాలన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ దివ్యాంగులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఎనిమిది మంది దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దివ్యాంగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎర్రపత్తి రమేశ్, సీడీపీవో నాగమణి, స్వాతి, మూర్తి, మధుసూదన్ రెడ్డి, సగ్గం రాజు, ఎజాజ్, దివ్యాంగుల సంఘం నాయకులు సాక్‌పెల్లి సురేందర్, ముత్యం, భగవాన్, ఇసాక్, సట్టి సాయన్న, గంగాధర్, సత్యనారాయణ, శ్రీనివాస్, భూమేశ్, ప్రవీణ్, అశోక్, పుష్ప, దివ్యాంగులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, పాల్గొన్నారు.

### రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ టౌన్, జనవరి 24: మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రయోజనం పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో దక్కన్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రుణమేళా కార్యక్రమం నిర్వహించగా, ఆయన హాజరయ్యారు. బ్యాంకులు అందిస్తున్న రుణాలను వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. రూ. 50 కోట్ల రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బ్యాంకు మేనేజర్ శోభ, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏపీడీ గోవింద్‌రావు, డీపీఎం గణేశ్, తదితరులున్నారు.

### నేడు జాతీయ ఓటరు దినోత్సవం..

జిల్లా కేంద్రంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఓటరు అవగాహన ర్యాలీలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఓటరు అవగాహన ర్యాలీని ప్రారంభిస్తామని, విజయవంతం చేయాలని ఓటర్లు, అధికారులను కోరారు.



దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

# ఛీసీఐ

## జిల్లా పత్తికి నాణ్యత లేదంటూ 'మద్దతు'కు మంగళం

- క్వింటాలుకు రూ. 50 తగ్గింపు
- తేమ ఒక పాయింట్ తగ్గినా కోతలే
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డుతో పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు

ఆదిలాబాద్, జనవరి 24 ( నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వాకం ఫలితంగా ఆదిలాబాద్ జిల్లాలో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7020 కాగా, సీసీఐ తన బాధ్యతను విస్మరించింది. పంట నాణ్యత పేరిట రైతులను నట్టేటా ముంచుతున్నది. జిల్లాలో రైతులు పండించిన పత్తి నాణ్యత లేదంటూ ధరను క్వింటాలుకు రూ.50 తగ్గించి కొనుగోలు చేస్తున్నది. సీసీఐ నిర్వాకం కారణంగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. జిల్లాలో గతేడాది అక్టోబరు చివరి వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో పది మార్కెట్ యార్డుల్లో పంటను సేకరించడానికి ఏర్పాట్లు చేశారు. సీసీఐతో పాటు ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. కొనుగోళ్లు ఫిబ్రవరి చివరివారం వరకు కొనసాగుతాయి. కాగా, ఇప్పటి వరకు సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు కలిసి 14 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఇంకా పూర్తిస్థాయిలో పంటను తీయలేదు. పంట అమ్మకాలు సగం కూడా పూర్తికాకముందే సీసీఐ ధర తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ మార్కెట్‌యార్డుల్లో కలిపి రోజు 25 వేల క్వింటాళ్ల వరకు పంట కొనుగోళ్లు జరుగుతాయి. క్వింటాలుకు రూ.50 తక్కువతో రైతులు పంటను విక్రయించడం వల్ల రూ.12.50 లక్షలను రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### ఆసియాలోనే నాణ్యమైన పంట

ఆదిలాబాద్ జిల్లాలో పండించే పత్తికి ఆసియాలోనే నాణ్యమైన పంటగా పేరుంది. జిల్లాలో నేల స్వభావం, పంటకు అనుకూలమైన వాతావరణం, అధిక వర్షపాతంతో పాటు రైతులు ఎన్నో ఏళ్లుగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. పంట సాగులో రైతులు అవలంబించే విధానాలు, విత్తనాల ఎంపిక, ఎరువులు, పురుగు మందుల వాడకం లాంటి విషయాల కారణంగా జిల్లాలో నాణ్యమైన పత్తి సాగువుతున్నది. దీంతో జిల్లా పత్తికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. పింజ పొడవు ఎక్కువగా ఉండడంతో పాటు దారంతో పొడవు ఎక్కువగా వచ్చి నాణ్యతగా ఉంటుంది. దారం గట్టిగా వస్తుంది. దూది సైతం తెల్లగా ఆకట్టుకునేలా ఉంటుంది. ఫలితంగా వ్యాపారులు ఆదిలాబాద్‌లో సాగు చేసే పత్తిని కొనడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. సీసీఐ మాత్రం నాణ్యత అంటూ కుంటిసాకులు చెప్పి ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది.




మద్దతు ధర క్వింటాలుకు రూ.7020 అని పెట్టిన బోర్డు

### రూ. 2వేల నష్టపోవాల్సి వచ్చింది..



నేను ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు 14.83 క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి తెచ్చిన. ఇప్పటి వరకు క్వింటాలుకు రూ.7020 తో కొనుగోలు చేసిన్రు. ఇప్పుడు క్వింటాలుకు రూ. 50 తగ్గించి కొంటున్నరు. తేమ పేరిట ఒక పాయింట్ తగ్గితే రూ.69 కోత విధిస్తున్నరు. సీసీఐ ధర తగ్గించడంతో నేను రూ.2 వేల వరకు నష్టపోయిన. సీసీఐ అధికారులు రైతులకు లాభం చేయాలి తప్ప నష్టం చేసేలా వ్యవహరించొద్దు. *- మడావి దత్తు, బెల్సరాంపూర్, భీంపూర్ మండలం*

### రైతులకు అన్యాయం చేయొద్దు



సీసీఐ రైతుల వద్ద నుంచి మద్దతు ధరతో పంటను కొనాలి. రైతులకు అన్యాయం చేసే విధంగా ధరను తగ్గించి కొనడం అన్యాయం. నేను 20 క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి తెచ్చిన. మద్దతు ధర కంటే రూ.50 తగ్గించి కొంటున్నరు. ధర తగ్గడంతో రైతులు భారీగా నష్టపోతున్నరు. ఎందుకు తగ్గిందని అడిగితే ఎవరూ సమాధానం ఇస్తలేరు. జిల్లాలో నాణ్యమైన పత్తిని పండుతది. సీసీఐ అధికారులు కావాలనే తక్కువ ధరకు కొంటూ రైతులకు నష్టం చేస్తున్నరు. *- సీహెచ్. ఆశన్న. రైతు, పొన్నారి. తాంసి మండలం*

# గడువులోగా పూర్తయ్యేనా..?

- రేషన్ షాపుల్లో కొనసాగుతున్న ఈ-కేవైసీ ప్రక్రియ
- ఈ నెల 31న ఆఖరు తేదీ
- జిల్లాలో ఇప్పటి వరకు 75.93 శాతం పూర్తి
- పని పెరిగిందని కేంద్రంపై డీలర్ల అసహనం



నిర్మల్‌లోని ఓ రేషన్ షాపు వద్ద ఈ-కేవైసీ చేస్తున్న రేషన్ డీలర్

నిర్మల్, జనవరి 24(నమస్తే తెలంగాణ): రేషన్ దుకాణాల్లో ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియ గడువులోగా పూర్తయ్యేలా కనిపించడంలేదు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రత కార్డులకు ఈ-కేవైసీ ప్రక్రియను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాలో ఇప్పటి వరకు 75.93 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఈ-కేవైసీ ప్రక్రియలో 76.92 శాతం పూర్తి చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, కేవలం ఒక శాతం తేడాతో నిర్మల్ జిల్లా రెండో స్థానంలో ఉంది. కాగా నిర్మల్ జిల్లాలో మొత్తం 2,08,486 రేషన్ కార్డులుండగా, 6,02,565 మంది సభ్యులున్నారు. వీరిలో ఇప్పటి వరకు 4,87,418 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇంకా 1,15,147 మంది సభ్యులు చేసుకోవాల్సి ఉన్నది. అయితే ఈ నెల 31తో ఈ-కేవైసీ ప్రక్రియ గడువు ముగియనుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజుల్లో వంద శాతం పూర్తవడం కష్టమేనంటున్నారు. మరో నెల రోజులు పొడిగించినా వంద శాతం ప్రక్రియ పూర్తవడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు. ఈ-కేవైసీ పేరుతో కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నప్పటికీ, కుటుంబ సభ్యులందరూ ఒకే సారి రేషన్ షాపునకు వస్తుండడంతో డీలర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. నయా పైసా అదనంగా ఇవ్వకుండా తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని డీలర్లు మండిపడుతున్నారు. ఒకవైపు బియ్యం పంపిణీ, మరోవైపు ఈ-కేవైసీని పూర్తి చేయడం డీలర్లకు సవాల్‌గా మారింది. ముందుగా 2023 డిసెంబర్ 31వ తేదీ లోగా పూర్తి చేయాలని భావించినా సాధ్యం కాలేదు. మళ్లీ ఈ నెల 31వరకు పొడిగించారు. ఈ నెలాఖరు వరకు కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించక పోవడంతో ఈ-కేవైసీ గడువును మరింత పెంచే అవకాశం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు రేషన్ షాపులు, మరోవైపు గ్యాస్ ఏజెన్సీలు, తాజాగా ఫాస్టాగ్‌కు సైతం ఈ-కేవైసీ అమలు చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


# నేటి నుంచి ఖాందేవ్ జాతర

- ముస్తాబైన ఆలయం
- తరలిరానున్న తొడసం వంశీయులు
- రేపు నువ్వుల నూనె తాగనున్న ఆడబిడ్డ
- 15 రోజుల పాటు వైభవంగా పూజలు
- భక్తుల కోసం ఆటలపోటీల నిర్వహణ

నార్నూర్, జనవరి 24: పుష్య మాసం పౌర్ణిమ సందర్భంగా నార్నూర్ మండల కేంద్రంలో ఖాందేవ్ జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఆలయాన్ని జాతర కోసం ముస్తాబు చేశారు. బుధవారం రాత్రి తొడసం వంశీయులు కుటుంబ సమేతంగా మాన్కాపూర్‌లోని గోవర్ధన్‌గుట్ట వద్ద బస చేశారు. గురువారం మైసేమాల్ దేవతకు సంప్రదాయ పూజలు చేయనున్నారు. సాయంత్రం కాలినడకన ఖాందేవ్ ఆలయానికి చేరుకుంటారు. అర్ధరాత్రి ఆలయంలో దేవతామూర్తులకు పవిత్రమైన గంగాజలంతో అభిషేకం చేస్తారు. సంప్రదాయ పూజల అనంతరం జాతర ప్రారంభిస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో తొడసం వంశీయుల ఆడబిడ్డ నువ్వుల నూనె(తైలం) తాగనుంది. ఫిబ్రవరి 8వ తేదీ వరకు జాతర వైభవంగా కొనసాగనుంది. జాతరలో భాగంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొనున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రజా దర్బార్ కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### ఖాందేవ్ జాతరకు ఆహ్వానం

ఉట్నూర్, జనవరి 24: ఖాందేవ్ జాతరకు హాజరవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఉట్నూర్ మండల కేంద్రంలో వారిని కలిశారు. ఈ సందర్భంగా ఖాందేవ్ జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తొడసం నాగోరావు, గోపాల్, గజేందర్, సభ్యులు ఉన్నారు.



మండల కేంద్రంలో కొలువుద్దీరిన ఖాందేవుడి ఆలయం



జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్

### సంప్రదాయరీతిలో జాతర



*దశాబ్దాలుగా తొడసం వంశీయులు పుష్య మాసం పౌర్ణిమ రోజున మా సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తాం. మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మా వంశీయులు దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆటల పోటీలు కూడా నిర్వహిస్తాం. చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. 15 రోజుల పాటు జారత కొనసాగనుంది.*

*-తొడసం నాగోరావ్ (ఆలయ నిర్వాహకుడు)*



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి

# శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- బాలలకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచన
- జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 24 : బాలలు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) కార్యక్రమం పట్టణంలోని కేజీబీవీ విద్యాలయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితోపాటు ఎమ్మెల్యే హాజరయ్యారు. వీరికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌ను విద్యాశాఖ అధికారులు శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డీఈవో ప్రణీత, ఎంఈవో జయశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ బంద్ పాక్షికం

ఎదులాపురం,జవనరి 24: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే సాధన సమితి ఇచ్చిన పట్టణ బంద్ పాక్షికంగా సాగింది. బుధవారం ఉదయం సాధన సమితి సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించి తెరిచి ఉన్న దుకాణాలను మూసివేయించారు. ఈ సందర్భంగా సాధన సమితి చైర్మన్ నారాయణ మాట్లాడుతూ 30 ఏండ్ల క్రితం పట్టణంలో అనేక పరిశ్రమలు ఉండేవన్నారు. సరైన రవాణ మార్గం లేక నేడు పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలిపారు. ఆదిలాబాద్‌లో ఆర్థికంగా స్థిర పడాలంటే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు కూడా మద్దతు తెలిపారు. సాధన సమితి సభ్యులు ముభారక్, లంకా రాఘవులు, తుల్జాపూరే శోభాతాయి, రఫీక్, గోడం గణేశ్ తదతరులున్నారు.



పట్టణంలో బైక్ ర్యాలీ ద్వారా షాపులను మూసివేయిస్తున్న సాధన సమితి సభ్యులు

# గౌరి గ్రామానికి మెస్రం వంశీయులు

నార్నూర్, జనవరి 24: నాగోబా మహాపూజకు ఉపయోగించే గంగాజల సేకరణ కోసం పాదయాత్రగా బయలు దేరిన మెస్రం వంశీయులు నాగల్‌కొండ(దేవరిగూడ) గ్రామానికి మంగళవారం రాత్రి చేరుకొని బసచేశారు. బుధవారం ఉదయం ఝూరికి గ్రామస్తులు సంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భోజనాలు చేశారు. తర్వాత కుమ్రం భీం జిల్లా జైనూర్ మండలం గౌరి గ్రామానికి పాదయాత్రగా చేరుకొని రాత్రికి అక్కడే బస చేశారు.



దేవరిగూడలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు, పాల్గొన్న పెద్దలు

# ముథోల్ గురుకులంలో ఏసీబీ తనిఖీలు

ముథోల్, జనవరి, 24 : ముథోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ఏసీబీ డీఎస్పీ వీవీ రమణ మూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మెనూ, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్‌లోని సరుకులు, రికార్డులను పరిశీలించారు. పాఠశాలపై వచ్చిన సమాచారం, ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసీబీ సీఐలు సునీల్ గౌడ్, జాన్ రెడ్డి, తదితరులుఉన్నారు.



ఉపాధ్యాయుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏసీబీ డీఎస్పీ వీవీ రమణ మూర్తి